
# సబ్బుబిళ్ళ

రాచకొండ
విశ్వనాథ శాస్త్రి




ఉదయం ఎనిమిదిన్నరయింది. తన 'స్టడీ రూం'లో సోఫామీద ఇస్సురంటూ కూర్చొని, దొంగని పట్టుకు తీసుకురమ్మని కబురు పెట్టేడు లక్షింపతి. దొంగని ఏం చెయ్యాలో ఏమిటో అతనికేం తోచకుండా ఉంది. తన నలభయ్యయిదేళ్ళ జీవితంలోనూ అతనెన్నడూ ఇటు

వంటి అవస్థలో, పరిస్థితిలో పడలేదు. ఏం చేద్దామన్నా అతనికేం పాలుపోకుండా ఉంది. ఒకవిధంగా చూస్తే పరిస్థితంతా ఫార్సులా కనిపిస్తోంది. మరోలా చూస్తే ట్రాజెడీలా తోస్తోంది.

సంగతేమిటంటే –

ఈమధ్య వరసగా, పది పదిహేను రోజుల్నించీ ఇంట్లోంచి సబ్బులు పోతున్నాయి. ఖరీదు దృష్ట్యా చూస్తే సబ్బుబిళ్ళలు పెద్ద విలువైన వస్తువులు కావు. పదో లేక పదిహేనో సబ్బులు పోయేయి. ఎన్ని పోయేయన్నది పెద్ద లెక్క కాదు లక్ష బిళ్ళలు పోయినా లక్షింపతికి లక్ష్యం లేదు. 'అయ్యో సబ్బులు పోయేయే !'



అని విచారిస్తూ కూర్చొని బెంగపెట్టేసుకో వలసిన అవసరం అతని క్షేమాత్రమూ లేదు. కాని ఆవిధంగా ఇంట్లోకి 'మురికి' ప్రవేశించడం చూసి మాత్రం లక్షింపతి సహించలేకపోయేడు.

లక్షింపతి పేరు లక్ష్మీపతి. అతని భార్య పేరు లక్ష్మయమ్మ. అతని బంగళా పేరు లక్ష్మీవిహార్. అతని కొడుకు, కృష్ణకుమార్, టెక్నాలజీ ఆనర్సు చదువు తున్నాడు. పెద్దకూతురు, రమాకుమారి, సెవెన్త్ స్టాండర్డ్‌కి వెళ్తోంది. ఆఖరి పిల్ల పేరు శశికళ. ఆ పిల్లకి అయిదే యేళ్లు. ఇంకా కిన్డర్‌గార్టెన్లో ఉంది.

తన పిల్లలందర్నీ లక్షింపతి సరైన పద్ధతుల్లో పెంచుకు వస్తున్నాడు. వాళ్ళ యెడల తన విద్యుక్త ధర్మాన్ని సక్ర మంగా నెరవేర్చ గలుగుతూన్నందుకు అతను తరచు తృప్తితో నిట్టూరుస్తూం టాడు. తృప్తే తప్ప అతని జీవితంలో ఇసుమంతైనా అసంతృప్తంటూ ఉండ డానికి అవకాశం లేకుండా చేసి వెళ్లిపోయే డతని తండ్రి.

లక్షింపతి తండ్రి మామూలు వాడు కాడు. జీవితంలో ఢక్కా-ముక్కీలు చాలా తిని, చాలా రకాల వ్యాపారాలు చేసి చాలా దెబ్బలు తిని, దివాలాతీసి చాలా బాధలుపడి, ఆఖరికి భూమట్టం అయిపోయి ఓ రోజున ఓ సత్రం అరుగు మీద కూర్చొని బాగా ఆలోచించేట్ట అతను. ఓ మూడు గంట లలా కూర్చొని ఆలోచించేసరికి అతనికి బాగా ఆకలివేసి ముఖం తిరిగి శోషొచ్చిందిట. తెప్పరిల్లు కున్నాక, అతనికి జ్ఞానోదయం అయిందట.

వ్యాపారం చెయ్యడం చాలా మంచిదే. వ్యాపారం తప్పకుండా చెయ్యవలసిందే. కాని, 'చేస్తే ఏ సరుకుతో వ్యాపారం చెయ్యాలి?' అనే ప్రశ్నకి అప్పుడా రోజున సమాధానం చెప్పుకున్నాడు లక్షింపతి తండ్రి.

"ఏది లేకపోతే ప్రజలు ఉండనే ఉండలేరో ఆ సరుకుతో వ్యాపారం చెయ్యాలి!"

అయితే — గాల్లేకుండా ప్రజలు బతక లేరు. కాని, గాల్ని దాచిపెట్టి దాన్తో వ్యాపారం చెయ్యడం అనేది కుదరని పని. పోతే, నీరుంది. నీటితో వ్యాపారం నడి పించాలంటే అది మున్సిపాల్టీలకే చెల్లింది, గవర్నమెంటుకైతేనే చెల్లు తుంది. గాలీ, నీరూ పోతే, బట్ట! అది కూడా లాభంలేదు. ప్రజలు బట్టల్లేక పోయినా బతికేస్తున్నారు, బాదం హల్వా లాటి భార్య ల్లేకపోయినా బతికేస్తున్నారు, బంగారంతో లేపిన మేడల్లేకపోయినా బతికేస్తున్నారు. కాని, "మనిషన్నవాడు ఏది లేకపోయినా బతగ్గలడు కాని, తిండి లేకపోతే మాత్రం బతకలేడు," అనే నిర్ధారణకి వచ్చాడా రోజున లక్షింపతి తండ్రి. కష్టపడో, జేబుయి కొట్టో, ముష్టెత్తో ఏదోవిధంగా ప్రతివాడూ ప్రతి

రోజూ తినాలి తినాలి తినాలి. అందుచేత, బేరం సదాబావుండే బిజినెస్ ఏదంటే తిండి బిజినెస్ తప్ప మరోటి లేదనే ఖచ్చితమైన నమ్మకం లక్షింపతి తండ్రి కాసమయంలో గట్టిగా కలిగింది. ఆ తరవాత, కాఫీ భోజన ఫలహారశాల స్థాపించి తద్వారా ప్రజలకి సేవచేస్సేసి చనిపోయేడతను. సేవ చెయ్యడమే అతని ముఖ్యోద్దేశం(ట) కాని, "డబ్బు చేసుకోడం కానేకాదు. డబ్బుకూడా అందులో అతనికి బాగా వచ్చిపడింది. డబ్బొచ్చి పడ్డప్పుడు ఎవడొద్దంటాడు? మీ రొద్దంటారా? అల్ల వాళ్లొద్దంటారా? ఎవడూ ఒద్దన్న కద! మరింకేం?!" ఆవిధంగా ప్రజాసేవ చేసి కీర్తీ ఆస్తీ విడిచేసి హాయిగా వెళ్ళిపోయేడాయన.

తండ్రి పోయిన తరవాత అతను చూపిన మార్గాన్నే ముందుకి పోతున్నాడు లక్షింపతి. తండ్రిలాగే అతనుకూడా చాలా సింపుల్‌గా ఉంటాడు. అతన్ని చూస్తే అతనికి నాలుగు సిటీల్లో నాలుగు పెద్ద హోటేళ్లున్నాయని కాని, అనేకానేక వ్యాపార సంస్థల్లో ఎన్నో షేర్లున్నాయని గాని తెలియడం కష్టం. లక్షల లక్షణాలు అతన్లో స్పష్టంగా కనిపించవు. ఊరి చివర తోటలో మేడొకటి కనిపిస్తుంది. కొత్తది కారొకటి కనిపిస్తుంది. శరీరాన్ని దబ్బపండులాటి ఛాయ కనిపిస్తుంది. అంతే! పొందూరు ఖద్దరుపంచా, బరంపురం పట్టులాల్చీ, కాకపోతే ఖద్దరు



"నీవు నన్ను చీల్చి చెండాడినా నా దగ్గర నయాపైసాకూడా లేదు."
"మొండిపీనుగ, ఏ వేషంలో వచ్చినా, బాకీ వసూలయేట్టు లేదు"

సూటూ తప్ప వేసుకోడతను. చాలా సింపుల్‌గా ఉంటాడు. పెద్దపెద్ద జమీన్దార్ల ఇళ్ళల్లో నీడపట్టున తిరిగే పచ్చని విధవ్వాళ్ళూ, పెద్దపెద్ద ఆరామాల్లో చల్లని పందిళ్ళకింద పాలరాతి గచ్చుమీద పసుప్పచ్చ పాంకోళ్ళతో నడిచే తెల్లని స్వాములూ సన్యాసులూ గుర్తుకొస్తారు లక్షింపతిని చూస్తే. వాళ్ళు చాలా సింపుల్‌గా ఉంటూనే ఎంతో ఎక్కువాళ్ళలా కనిపిస్తారు. ఆవిధంగా చాలా నిరాడంబరంగా నిర్మలంగా ఉండబట్టే పేరూ పలుకుబడీ పదవీ కూడా లక్షింపతిని వరించేయి. అతనికి జనరల్‌గా వ్యాపార వ్యవహారాలన్నా, ముఖ్యంగా హోటేలు వ్యాపారమన్నా చాలా ఏహ్యభావం ఉంది. కాని, వాటిని వదుల్చుకోలేకుండా ఉన్నాడతను. జీవుడు బతికుండాలంటే నిర్వ్యాపారంగా ఉండడానికి

కుదరదు. కాని, స్వయంగా ఆ వ్యవహారాల్లోకి వెళ్ళి చేతులు మురికిచేసుకోకుండా నెగ్గుకొస్తున్నాడు లక్షింపతి. అతనికి మంచి బావమరదులూ, మంచి మంచి మేనల్లుళ్ళూ ఉన్నారు. వాళ్ళు ఆ వ్యవహారాలన్నీ చూసుకొంటున్నారు. అందుచేత లక్షింపతికి ఇంట్లో, కార్లో, క్లబ్బులో, మీటింగుల్లో, లోకల్ మ్యున్సిపాలిటీలో, యూనివర్సిటీ సెనేట్లో, గవర్నమెంటు అసెంబ్లీలో అన్ని స్థలాల్లో కూడా కాలుమీద కాలు వేసుకూర్చుందికీ, శాస్త్రాల గురించి చర్చించుకొందికీ వీలుచిక్కుతోంది.

లక్షింపతి ఏ పని చేసినా శాస్త్రీయ దృక్పథంతోనే చేస్తాడు. వైవాహిక జీవితం అంతాకూడా ఆ దృక్పథంతోనే నడిపించుకొస్తున్నాడతను. అతని కొడుక్కి పంథొమ్మిదేళ్ళు, పెద్దకూతురికి పన్నెండేళ్ళు, రెండో కూతురికి అయిదేళ్ళు. మంచి సంతానం కలగాలంటే శాస్త్రప్రకారం పిల్లపిల్లకీ ఆపాటి తేడా ఉండాలిట. చెప్పిన ప్రకారం లక్షింపతి సంతానంలో ఆ తేడా కనిపిస్తుంది.

లక్షింపతికి ఇటువంటి 'శాస్త్రం వెర్రి' ఉన్నదని అతని బీద బంధువులందర్లోనూ ఒక దురభిప్రాయం ఉంది. వాళ్లెవరూ కూడా తరుచు అతనింటికి వెళ్ళరు. వెళ్లకపోడానికి ఒక కారణం ఏమిటంటే, లక్షింపతింట్లో పేదవాళ్ళంటే ఇష్టంలేని రెండు జాగిలా లున్నాయి. రెండో కారణం ఏమిటంటే, "మూడు సార్లు సబ్బుతో పాఁవుఁకొని స్నానం చేసొస్తేకాని గుమ్మం తొక్కనివ్వడు లక్షింపతి!" అనే అభిప్రాయం ఉంది వాళ్ళకి. లక్షింపతి గురించి "వాడికి సబ్బుపిచ్చి ఉంది బాబూ!" అంటారు వాళ్ళు.

లక్షింపతికి ''సబ్బు పిచ్చి"ఉందనడం అన్యాయమే అయినప్పటికీ, అందరూ అలా అనుకొందికి మాత్రం చాలా పెద్ద కారణం ఉంది.

యుగయుగాలనించీ మానవుడు చీకట్లోంచి వెలుగులోకీ, అజ్ఞానంలోంచి జ్ఞానంలోకీ, మాలిన్యపు కూపంలోంచి నిర్మల జీవితంలోకీ రా ప్రయత్నిస్తున్నాడు. అలా రాగలగడమే మానవ నాగరికత. అయితే, లక్షింపతి సుస్పష్టంగానూ ప్రత్యక్షంగానూ మైలలోంచి మనిషిని మడిలోకి సబ్బుమాత్రం మార్చగలగడం చూసేడు.

అందుచేత –

నాగరికతకి సబ్బుబిళ్ళని సింపుల్ సింబల్‌గా పెట్టుకున్నాడు లక్షింపతి.

అతని దృష్టిలో సోపు లేని సంసారం నిజంగా యమకూపమే కాని సంసారం కాదు. ఆరోగ్యమే మహాభాగ్యం అని భావిస్తాడు. కాని డబ్బే మహద్భాగ్యం అని భావించడతను. సివిలిజేషన్కి సబ్బొక చిహ్నం అని అతనెప్పుడో ఎక్కడో ఏదో ఇంగ్లీషు పుస్తకంలో చదివేడు కూడాను. ఆ మాట అతన్లో

గాఢంగా నాటుకుపోయింది. ఒక్కొక్కప్పుడు సోఫాలో తీరిగ్గా కాళ్ళు జాచు కూర్చొని కళ్ళు మూసుకొని "సబ్బుంటే ఏ౹వి౹టి?" అని ప్రశ్నించుకొని, "సబ్బుంటే సివిలిజేషను!" అని తనకి తనే సమాధానం చెప్పుకుంటూంటాడతను. ఎవరికైనా తెలిస్తే నవ్వురావచ్చు కాని, అతనికో గమ్మత్తయిన అలవాటు కూడా ఉంది. "సబ్బేనా మరి సివిలిజేషను? సబ్బుంటేనే సివిలిజేషను! సబ్బే కదా సివిలిజేషను?! సబ్బె సబ్బే సివిలిజేషను!!" అని ఓ చిన్నపాట కట్టుకొని వంటరిగా కూర్చున్నప్పుడు నెమ్మదిగా రాగవరసలో పాడుకొంటూ ఉంటాడతను!

లక్షింపతి బంగళా కూడా అతి మోడర్న్ ఫాషన్లో ఉన్నప్పటికీ అతి సింపుల్‌గా అతి నిగర్వంగా ఉన్నట్టనిపిస్తుంది. అతని బంగళా గేటు మీది విద్యుద్దీపాలుకూడా సింపుల్‌గా పాత కాలపు వీధి లాంతర్ల డిజైన్లో ఉంటాయి. తోట, మేడ, అంతా అన్నీకూడా అతి క్లీన్‌గా ఉంటాయి. ఇంట్లో వాడుకొనే ప్రతిగదికీ వేర్వేరుగా బాత్‌రూంలు అమిర్చి కట్టించేడు లక్షింపతి. వాట్లో ఎక్కడికక్కడ అద్దాలూ, సబ్బులూ, నీళ్ళతొట్టెలూ, షవర్‌బాత్లూ ఉంటాయి. ఇల్లూ తోటా అంతాకూడా పాలిష్ చేసిన అద్దంలా మెరుస్తుంది; మంచి సబ్బు వాసనతో కూడిన ఆంటీసెప్టిక్ వాసన వేస్తుంది. లక్షింపతీ అతని భార్యా, వారి ముగ్గురు పిల్లలూ కూడా సైజువారీగా అయిదు ఖరీదైన సబ్బుముక్కల్లా ఉంటారు. వాసన చూస్తే మధురమైన సబ్బు వాసన వేస్తారు కూడాను. (కృష్ణ. రమ, శశి) ముగ్గురు పిల్లలూ కూడా ఎప్పుడూ మట్టిలో ఆడుకున్న పాపాన పోలేదు. బొమ్మల్తోనూ బొంగరాల్తోనూ ఆడుకున్నప్పుడు కూడా లోషన్తో కడిగి తుడిచిన గదుల్లో, డెట్టాల్లో ముంచి తుడిచిన బొమ్మల్తోనూ బొంగరాల్తోనూ తప్ప ఆడుకొని ఎరగరు వాళ్ళు. ముగ్గురూ కూడా రంగుల ఉల్లిపొర కాయితాల్లో ముచ్చటగా చుట్టిన అమెరికన్ సబ్బుల్లా మెరుస్తూంటారు. ఆ యింట్లో లక్షింపతి కుటుంబంలో అంతాకూడా చెరువులో పద్మాల్లా, వెన్నెల్లో వజ్రాల్లా, నీలాకాశంలో తెలిమబ్బుతరకల్లా స్వచ్ఛంగా నిర్మలంగా మోహనంగా ఆహ్లాదకరంగా ఉంటారు. వాళ్ళింట్లో అక్కడ పాలు, అక్కడ మీగడ, అక్కడ తేనె, అక్కడ వెన్న, రొట్టె, అన్నం, పరమాన్నం, అక్కడ అందం ఆరోగ్యం ఆనందం అంతా చూస్తోంటే "అన్ని స్వర్గసుఖంబులన్నవి అవని విలసిల్లున్!" అన్న మాట చప్పున గుర్తుకొస్తుంది. చల్లగాల్లో నిర్మలాకాశంలో అందని ఎత్తులో సాఫుగా మెత్తగా ఎగురుతూ వెళ్ళే విమానంలా హాయిహాయిగా హాపీహాపీగా వెళ్తోంది లక్షింపతి జీవితం.

అంతా అలా దివ్యంగా వెళ్తోంటే ఒక రోజున లక్షింపతి ఇంట్లో పాలరాతి బల్లమీది పాలకప్పుమీద ఈగ వాలింది. ఇంద్రభవనంలాంటి ఇంట్లోకి ఈగ జొరబడిందనే సరికి లక్షింపతి మనసు సంక్షోభం చెందిపోయింది. ఆతనికి చిత్తశాంతి లేకుండా అయిపోయింది.

ఓ రోజున ఎప్పట్లాగే పొద్దున్న తన స్టడీ రూంలో కూర్చొని శశికళకి పాఠం చెప్తున్నాడు లక్షింపతి. పాత పాఠమే అది. పెళ్ళయిన కొత్తలో భార్యకి చెప్పేడు, ఆ తరవాత కృష్ణకీ, అటుపిమ్మట రమకీ చెప్పేడు. ఇప్పుడు శశికళ వంతొచ్చింది.

శశికళని ఆరోజుకూడా యధావిధిగా ప్రశ్నించేడు.

''సబ్బంటే ఏవిఁటమ్మా చిట్టితల్లీ?''

తండ్రి కూర్చున్న సోఫామీద కుడిచెయ్యి ఆన్చుకొని ఎదురుగా కిటికీలోకి చూస్తూ "చబ్బంటే...—చబ్బు...... అంటే......" అని ఆగిపోయి తండ్రి ముఖంలోకి చూసి సిగ్గుపడిపోయింది శశికళ. ఆ పిల్లకి మరుపెక్కువ.

"చెప్పమ్మా! రోజూ చెప్తున్నాకదా?! మళ్ళీ మర్చిపోయేవా?"

శశికళ ఏడుపుముఖం పెట్టేసి తల దించేసుకొంది. పొట్టిగా బాబ్‌గా కత్తిరించిన జుట్టు ఆ పిల్ల కళ్ళల్లోకి పడుతోంది. అసలే సెల్యులాయిడ్ బొమ్మ రంగులో ఉంటుందా పిల్ల చాయ. సిగ్గూ ఏడుపూ రావడంతో కెంపురంగు సబ్బులా అయిపోయిందామె ముఖం.

''సబ్బంటే సివిలిజేషనే చిన్నారీ!'' అంటూ కూతుర్ని దగ్గిరగా తీసుకు ముద్దులాడేడు లక్ష్మింపతి.

అయిదో యేడొచ్చినా శశికి మాటలింకా సరిగ్గా రావు. శశికి "చెచి" అంటుంది, సబ్బుకి "చబ్బు" అంటుంది. సివిలిజేష ననేమాట పలకనంటుంది. కాని మిగతా పాఠంమట్టుకు నెమ్మదిగా వల్లిం చేస్తుంది.

''పొద్దున్నే లేవ్వాలెను. పల్లు చుబ్బరంగా తోంవలెను. నీల్లు పుక్కిలించి...''

''ఉమ్మవలెను'' అని అందిస్తాడు లక్షింపతి.

"నీల్లు పుక్కిలించి ఉమ్మవలెను. ముకం చుబ్బరంగా...''

"సబ్బుతో కడుక్కోవలెను" అని మళ్ళీ అందించాలి లక్షింపతి.

''చబ్బుతో కడుక్కోవలెను. చేతులు కూడా చుబ్బరంగా—చబ్బుతోనే కదు డాడీ?"

''సబ్బుతోనేనే చిట్టీ!''

"చేతులు చుబ్బరంగా చబ్బుతో కడుక్కోవలెను. ఆ తరువాత..." అంటూ ఆగిపోతుంది శశి.

''ఆ తరవాత ఏం చేస్తావమ్మా? చెప్పు!''

''ఆ తరువాత ఓవల్టీను తాగాలి కదు డాడీ?"

''అవును చిట్టితల్లీ !''

''అప్పుడు ఓవల్టీను తాగవలెను. ఆ తరవాత తానం...''

''తానం కాదమ్మా ! స్నానం !''

''తానం కాదు చానం చేయవలెను. చానంకూడా తబ్బుతోనే కదు డాడీ చెయ్యాలీ ?''

''తబ్బు కాదమ్మా ! సబ్బు !''

''చబ్బుతో తుబ్బరంగా చానం చేయవలెను.''


అలా పాఠం అంతా చెప్పుకుపోతుంది ''చెచి''.

ఆ రోజుకూడా హెల్తుపాఠం అయాక శశికి జాగ్రఫీ పాఠం చెప్పేడు లక్షింపతి. అతనికి హిస్టరీ అంటే ఇష్టంలేదు. మనుషులూ, కొట్టుకోడాలూ, చావడాలూ అంటే అతనికి సరిపడదు. సముద్రాలు, ఖండాలు, గనులు, సిరులు, సంపదలు వాటిగురించి చదవడం అన్నా చెప్పడం అన్నా అతనికి చాలా సరదా. జాగ్రఫీ పాఠం అయేక శశి వెళ్ళిపోయింది. ఇంకా ఎనిమిది కాలేదు. దినపత్రికలో వ్యాపార రంగం వార్తలూ విజ్ఞాన విశేషాలూ చదువుకొని పక్కనున్న బల్లమీద పత్రిక పడేసి స్నానానికి లేవబోయేడు లక్షింపతి.

అంతలో వగర్చుకొంటూ వచ్చింది రమ.

''ఏం ?'' అన్నాడు లక్షింపతి.

రమ మాట్లాడలేక పోయింది. రొప్పుతూ నిల్చుండిపోయింది. ఆ పిల్ల




''కాస్త నొప్పొచ్చిందా ?''

తండ్రి నోట్లోంచి వచ్చినట్టుంటుంది. పది సార్లు కడిగి తుడిచిన స్టేన్‌లెస్ స్టీల్ పళ్ళెంలా తళతళ్లాడుతూ గుండ్రంగానూ, గుండ్రని గులాబిరంగు సబ్బులా దళసరిగానూ ఉంటుందా పిల్ల ముఖం. పన్నెండేళ్ళు అయినప్పటికీ పద్దెనిమిదేళ్ళ పిల్లలా కనిపిస్తుంది. నెల్లాళ్ళనించీ వోణీ వేసుకొంటోంది. ఆ పిల్ల ముఖం ఆ రోజు మాత్రం కళ తప్పింది.

''ఏం రమా ?'' అని మళ్ళీ అడిగేడు లక్షింపతి.

''మళ్ళీ పోయింది డాడీ !'' అంది రమ.

''ఏం పోయింది ?''

''సబ్బు !''

''సబ్బే !!''

''సబ్బే ! నా బాత్‌రూంలోది !''

లక్షింపతి ఆ మాట వినగానే ప్రళయ భీకరంగా లేచేడు. అయిదారు సబ్బులు పోయేయని అంతకుముందు భార్యచెప్పగా విన్నాడు కాని అంతగా పట్టించుకోలేదతను. కాని మళ్ళీ ఆ మాట వినగానే అతనికి చాలా చిరాకువేసింది. ఎవరో

తమని తమాషాచేసి వెక్కిరిస్తున్నట్టుగా తోచిందతనికి. చిన్నప్పుడు క్లాసు లో రౌడీపిల్లలు అతని పుస్తకాలు దాచేసి అలాగే అల్లరిచేస్తుండేవారు. ఆ సంగతి గుర్తుకొచ్చి అతను చాలా మండిపడ్డాడు. ఎక్కడో ఎవరో ఎప్పుడో తనని చూసి ఎందుకోగాని కిసుక్కున నవ్వడం జ్ఞప్తి కొచ్చిం దతనికి.

సబ్బు పోవడం చిన్నవిషయమే! కాని, చిన్న విషయాలే పెద్ద ఘోరాలకి దారితియ్యొచ్చు. తోటకూరకాడే కదా పోయిందేదో పోయిందని ఈ రోజున గమ్మున ఊరుకొంటే రేపొద్దున్న రిస్టు వాచీలు, రేడియోలు, వజ్రాల దుద్దులు, ముత్యాల హారాలు, కంటెలు, కాసుల పేర్లు, కడుపుల్తో ఉన్న ఇనప్పెట్టెలు, వాటిలో ఏదైనా పోవచ్చు. లేదా వరసగా అన్నీపోవొచ్చు. ఊరుకోకూడ దూరుకో కూడదు. దొంగని పట్టితీరాలి!

అందుగురించి నడుంబిగించి రంగం లోకి దిగేడు లక్షింపతి. కాని భార్య తోనూ, కొడుకుతోనూ, పెద్దకూతురి తోనూ ("శశితో చెప్పొద్దు! చిన్నపిల్లలకి ఇలాంటివి తెలియకూడదు!") సబ్బులు ఎన్నిపోయినప్పటికీ అల్లరిమాత్రం చెయ్యొద్దని వార్నింగిచ్చేడు. నౌకర్లం దర్నీమాత్రం రహస్యంగా కనిపెడుతూ ఉండమన్నాడు.

ఆ విధంగా ఉత్తరువు జారీచేసి వారంరోజులయింది.

ఈ వారంరోజుల్లోనూ జరిగిన విష యాలన్నీ తల్చుకొంటూంటే లక్షింపతికి దుఃఖమూ ఒస్తోంది, కోపమూ కలుగు తోంది. అసహ్యమూ వేస్తోంది తనూ, భార్యా, కొడుకూ, కూతురూ—నలుగురూ కూడా తమ ఇంట్లో తామే దొంగలు తిరిగినట్టు తిరగడం తల్చుకొంటే అదంతా అతనికి చాలా వికృతంగా కనిపిస్తోంది. ఎలకని పట్టడానికి పుల్లూ సింహాలూ సీరియస్‌గా పనిగట్టుకు తిరిగినట్టు, ఎవరి కైనా తెలిస్తే నవ్వులపాలయేట్టు అదంతా ఆ విధంగా జరగడం తల్చుకొంటే అత నికి చాలా నామోషీగా ఉంటోంది. ఇద్దరు ఆడ పనిమనుషులు, వంటవాడు, తోటమాలి, డ్రయివరు, ఇద్దరు బంట్రో తులు, ఇద్దరు గుమాస్తాలు. అందర్నీ — తను! — తను వెంటాడి తిరగడం! ఎవ రికైనా తెలిస్తే — నవ్వరా? వెక్కిరిం చరా? వేళాకోళం చేసి అల్లరిచెయ్యరా? ఎందుకు చెయ్యరు?!

ఆఖరికి ఇద్దరు పనిమనుషుల్లోనూ ఒకామె కూతురు దొరికిపోయింది.

ఆ పిల్లని లక్షింపతే స్వయంగా పట్టు కున్నాడు. ఎర్ర పరికిణీ, నల్ల జాకెట్టు వేసుకున్న పదేళ్ళ నల్లనిపిల్ల పరికిణీలో "బట్టల సబ్బొకటి దాచుకు" పట్టుకు పోతోంటే, "హార్! ఆగక్కడ!"అని ఆపి పట్టుకున్నాడు. ఉదయం పదిగంట లయింది. పిల్లలు స్కూళ్ళకీ కాలేజీకీ వెళ్ళిపోయేరు. తను కొడదా మనుకోలేదు

కాని లక్ష్మయమ్మ ఆపిల్లకి రెండులెంప కాయలు ఇవ్వకుండా ఉండలేక పోయింది. అంతలో దాని తల్లొచ్చి పాదాలు పట్టుకొంటే పిల్లమీదా తల్లిమీదా కేకలువేసి పొమ్మన్నాడు. "దాచలేదు! అమ్మగోర్ని అడిగి ఒట్టుకుపోదా రను కొన్నానోలమ్మోలమ్మో!'' అని ఆపిల్ల గోలపెట్టి ఏడ్చింది. కాదు, దొంగతనంగా దాచి పట్టుకుపోతోందనే లక్షింపతి నమ్మకం. కాని ఏదో ఒకవిధంగా తగువు సెటిలయిపోయింది. ఆ రాత్రి హాయిగా నిశ్చితంగా నిద్రపోయేడు లక్షింపతి.

కాని, అంతటితో అయిపోలేదు. మర్నాడు మళ్ళీ పోయింది కొత్తసబ్బు బిళ్లొకటి!

దాన్తో నిజంగా పిచ్చెత్తినట్టయి పోయేడు లక్షింపతి ఎవరిదీ నాటకం? ఏమిటి ఈ తుంటరితనం? ఎవరికో కాని ఎంతటి దుస్సాహసం?! "దొరికితే మాత్రం — ఎవరయిందీ — ఆ దొంగ రాస్కెల్ని షూట్ చెయ్యన్దీ విడిచిపెట్టను" అనే నిశ్చయానికి వచ్చేడు లక్షింపతి. చాలా పట్టుదలపట్టేడు.

ఏమనుకొంటే ఏం ప్రయోజనం? అంతా ఘోరం అయిపోయింది. లక్షింపతికి గుండెలుమండి కళ్ళు చెదిరిపోతున్నాయి. అతనికి వాంతయేట్టుగాకూడా ఉంది.

పొద్దున్న ఇంకా చీకటి ఉండగానే లేచి, ఖద్దరుపంచా, సిల్కుచొక్కా వేసు కొని చేతికర్ర ఊపుకొంటూ సముద్ర



తీరాన్న ఎకాఎకీని నాలుగుమైళ్ళు నడిచే అలవాటుంది లక్షింపతికి. ఆ ప్రకారం వెళ్ళి వస్తూంటే దార్లో ఈ రోజున జిల్లా కలెక్టరుగారి తండ్రి తగిలేరు. అతని కూడా "ఆరోగ్యం వెర్రుంది." లక్షిం పతి దొరగ్గానే అతణ్ని పట్టుకు విడప కుండా ఆరోగ్య సూత్రాలగురించీ,యోగా భ్యాసాలగురించీ గంటన్నరసేపు డబ్బా వేసేడతను. కొడుకుమీదుండే గౌరవం కొద్దీ తండ్రిని టోలరేట్ చేసేడు లక్షిం పతి. ఆ ముసలాణ్ని ఒదుల్చుకొనేసరికి బ్రహ్మాండం అంత పనయింది. ఉదయం ఏడున్నర గంటలయిపోయింది. గబగబా నడిచి ఇంటికివస్తూ పెరటిగేట్లోంచి ఇంటికి తొందరగా వెళ్ళవచ్చుననే ఉద్దే శంతో అటువైపు నడకమళ్ళించి జోరుగా నడుస్తూ నడుస్తూ గేటుకి అరవై గజాల దూరంలో ఆగిపోయేడు లక్షింపతి. అక్క డంత భయంకరమైన జుగుప్సాకరమైన

దృశ్యం చూడవలసొస్తుందని కలలోనైనా అనుకోలేదతను.

గేటు బైట ముగ్గురు వికృతమైన అమానుషమైన ఆడవాళ్ళు నిల్చున్నారు. ముగ్గురి చేతుల్లోనూ వంకరపోయిన కర్రలూ, నలిగిపోయిన డొక్కులూ కనిపిస్తున్నాయి. ముగ్గురివీ నడుంలు వంగిపోయున్నాయి. భూత ప్రేత పిశాచాల్లా ఉన్నారు వాళ్ళు. పొడవాటి సందు సందంతా నీడగా చల్లగా మరింకెవరూ లేకుండా కనిపిస్తోంది. లక్షింపతి చూసేసరికి వాళ్ళు ముగ్గురూ కోరలు చూపించుకొంటో కేకలు వేసి బూతులు తిట్టుకొంటున్నారు. తిట్టుకొంటూ తిట్టుకొంటూ — అతనలా చూస్తోండగానే — డొక్కులు కింద పడేసి పీక్కోడం మొదలుపెట్టేరు. ఇద్దరాడవాళ్ళు ఓ బంగారంరంగు గుడ్డ చెరోవైపూ పట్టుకొని "నాది" అంటే "పో లంజా ! నాది !" అంటూ గుంజాయించుకొంటూ ఉంటే మూడో మనిషి ఎడంగా నిల్చొని కర్రతో వాళ్ళని కొడుతూ, మధ్యమధ్య దగ్గరకొచ్చి ఆ గుడ్డపేలికని తను లాక్కొందికి ప్రయత్నిస్తోంది. అంతలో, అంతవరకూ గేటుదగ్గర నిల్చొని వాళ్ళని భయంతో చూస్తోన్న అయిదేళ్ళపిల్ల, హఠాత్తుగా "కొత్తుకో ఒద్దు ! కొత్తుకో ఒద్దు !" అని ముందుకి పరిగెట్టి వాళ్ళమధ్యకి వచ్చి వాళ్ళని విడదీయబోయి వెనక్కి పడిపోయింది.

"శశీ ! శశీ !" అంటూ ఆ దృశ్యం చూడలేక కళ్ళుమూసుకు పరిగెత్తేడు లక్షింపతి.

అదీ జరిగిన ఘోరం !

కన్ను పోయిన ముఖం ఒకటి ! ముక్కు లేన్దీ, కోరల్తో నిండిన్దీ ముఖం మరొకటి ! కురుపులు కురుపులుగా ఉన్న ముఖం వేరొకటి ! అక్కడ నలిగిన రేకు డొక్కుల్లోంచి ఒలికిన రకరకాల ముష్టి బియ్యాలు ! అందులోనే కొన్ని నయాపైసలు ! మూడు సబ్బులు ! వాళ్ళ చేతుల్లో నలిగి నాశనమైన తన భార్య షిఫాన్ చీర ! ఆ బుగ్గిలో ఆ రోగంలో రొచ్చులో వాళ్ళమధ్య శశి !

శశీ ! శశీ !

ఆ విధంగా అదంతా జరిగిందంటే నమ్మలేకుండా ఉన్నాడు లక్షింపతి. వాళ్ళని తను చేతికర్రతో కొట్టడం, వాళ్ళు ఏడ్చి పారిపోబోడం, తను బలవంతాన శశిని పీక్కొని ఇంట్లోకి రావడం, ఇంట్లో హడావిడి — అంతా కలలా పీడ కలలా కనిపిస్తోందతనికి ముప్పావుగంట కిందటే జరిగినా అదంతా ఎప్పుడో, ఎక్కడో జరిగినట్టనిపిస్తోంది.

శశిని బాత్‌రూంకి పంపించి తను బాత్‌రూంలోకి పోయి బాగా శుభ్రంగా స్నానంచేసి బట్టలు మార్చుకొని వచ్చి స్టడీరూంలో కూర్చొని శశిని తీసుకు రమ్మని కబురు పంపించి ఆలోచిస్తూ అలా ఉండిపోయేడు లక్షింపతి.

శశికళ ఎందుకీ పాడుపని చేసింది ?

వాళ్ళంతా తమలాగే ఆరోగ్యంగా, శుభ్రంగా ఉండాలనేనా ఆమె ఉద్దేశం ? అందుకేనా వాళ్ళకి రోజూ పట్టుకు వెళ్ళి సబ్బులిచ్చేసింది ? వాళ్ళకి మంచి బట్టల్లేవనా ఇంట్లోది షిఫాన్ చీర పట్టుకు వెళ్ళి ఇచ్చింది ? తమలాగే వాళ్ళంతా కూడా ఉండాలనేనా ఆ విధంగా చేసింది?

సందేహం లేదు. అందుకే చేసింది. ఆలోచించినకొద్దీ అదే నిర్ధారణవుతోం దతనికి. అవును ! తను చెప్పిన పాఠమే ఆచరణలో పెడుతోంది శశి !

కాని తను చెప్పిన పాఠాన్ని ఈ విధంగా విపరీతమైన ఆచరణలో పెట్టడం మంచిదికాదని ఆ పిల్లకి ఎలా చెప్పడం ? ఎలా చెప్పడమో అర్ధంకాక లక్షింపతికి భయంవేసింది. అతని మనసంతా ఆందోళనతో నిండిపోయింది. ఇలాటి పిల్లలు పెద్దవుతే ఏమవుతారో ఊహించుకొనేసరికి అతనికి గుండెల్లో దడ పుట్టుకొచ్చింది. ఇలాటి పిల్లలు ఎంత ప్రమాదమైన పనైనా చేసేయొచ్చు—"భూతదయ ! మానవసేవ !" అంటూ కారుణ్యపు కబుర్లు చెప్పి ఏ క్షయరోగులకో కుష్టువాళ్ళకో ఎవరికో సేవ చేస్తామని పట్టుపట్టి ఏ వెర్రి తిరుగుళ్ళు తిరిగినా తిరగొచ్చు ! లేకపోతే, "న్యాయం ! సత్యం ! ధర్మం ! నీతి ! నిజాయితీ !" అంటూ కేకలు వేసి ఏ తగువుల్లోకో ఏ తిరుగుబాట్లలోకో దూకి ఏ జైలుకైనా పోవొచ్చు ! ఏ ఉరికంబమైనా ఎక్కొచ్చు !




"ఏరా మీ బామ్మ చచ్చిపోతూ ఏదో ఆస్తి నీ పేర వ్రాసి చచ్చిపోతుందన్నావ్, ఏమి వ్రాసింది ?"

"ఏం చెప్పను గురూ, ఆవిడ రెండు కుక్కపిల్లల్ని పెంచేది. ఆవిడ సంతోషిస్తుందని, ఆవిడ ఎదురుగుండా ఆ కుక్కపిల్లల్ని ఎత్తుకుని ముద్దాడేవాణ్ణి. ఆఖరికి ఆవిడ పోతూపోతూ ఆ కుక్కపిల్లలుమాత్రం నాకు చెందేలా వ్రాసింది"

లక్షింపతికి నిజంగా చాలా భయం వేసింది, ఈ పిల్లని ఎలా కుదుటపర్చడం? ఏ విధంగా కట్టుబళ్ళోకి తేవడం ? అతనికేం దారీ కనిపించకుండా ఉంది.

రిస్టువాచీ చూసుకున్నాడు లక్షింపతి. ఎనిమిదిన్నర దాటింది. అతను కూర్చున్న గదంతా ఉదయం వెలుగులో అద్దంలా అగుపిస్తోంది. గదిలో అన్ని వస్తువులూ కూడా సబ్బుతో పామి పామి కడిగి, తుడిచినట్టుగా మెరుస్తున్నాయి. తూర్పు

పై పున్న విశాలమై కిటికీల్లోంచి ఎండ అతి స్వచ్ఛంగా నిర్మలంగా స్నానంచేసి షోకు చేసుకువచ్చినట్టు వచ్చిపడుతోంది అవతల తోటలో క్రోటన్సు మొక్కలు, రంగులు వేసుకొన్న ఆడగత్తెలు రంగస్థలంమీద డాన్సుచేస్తూ ఊగినట్టు, కిటికీల్లోంచి చిత్రంగా ఊగుతూ కనిపిస్తున్నాయి తోటలోంచి చల్లగాలి చల్లని సెంటువాసన్లు పూసుకొని కిటికీల్లోంచి గదిలోకి ఘుమఘుమలాడుతూ వస్తోంది ముందురోజు రాత్రి బాగా రెండు గంటల పాటు వర్షంపడి తెల్లవారక ముందే పూర్తిగా వెలిసిపోయింది లీవు బెల్లు కొట్టేస్తే స్కూలు పిల్లలు ఆడుకున్నట్టు తోట్లో ఎండా గాలీ, క్రోటనులూ, పూల మొక్కలూ, పువ్వులూ, సీతాకోక చిలుకలూ కలకలా ఆడుకొంటున్నాయి దూరంలో పనస చెట్టొకటి పిల్లల స్నానాలయేక తను స్నానంచేసి ఎండలో తలారబోసుకొంటోన్న తల్లిలా నిల్చొని పిల్లమొక్కల్ని చూస్తూ జాలిజాలిగా నవ్వుతోంది

దొరకలేదు లక్షింపతికి కారణాలు దొరకలేదు మనుష్యులు మంచిగా ఎందుకుండకూడదో కూతురికి నచ్చజెప్పడానికి అతనికి సరైన కారణాలు ఎంత వెతికినా దొరకలేదు అతనికి ఎందుకోగాని అకస్మాత్తుగా తీవ్రమైన కోపం కలిగింది

శశినింకా ఎందుకు తీసుకురాలేదు ? ? ఎందుకీ ఆలస్యం ? ?

చిరాగ్గా లేచి నిల్చొని కిటికీవద్దకి వెళ్ళి తోటలోకి చూస్తూ నిల్చున్నాడు లక్షింపతి

అంతలో ''ఇదిగో శశి !'' అన్న లక్ష్మయమ్మ కంఠం వినిపించిందతనికి వినిపించేసరికి పులిలా వెనక్కితిరిగేడు

స్నానంచేసి కొత్తఫ్రాకు వేసుకొని, ఎత్తుమడమల స్లిప్పర్సు తొడుక్కొని, తలకి కెంపురంగు రిబ్బను చుట్టుకు ముడి వేసుకొని గుమ్మంలో నిల్చొంది శశికళ ఎంతో సేపట్నించీ ఏడుస్తున్నట్టుగా ఆ పిల్ల ముఖమంతా ఎర్రగా తడిగా ఉంది. ఆ సమయంలో ఆ పిల్ల వానకి తడిసిన గులాబి పువ్వులా ఉంది ఆ పిల్ల వెనక లక్ష్మయమ్మా, కృష్ణకుమారూ, రమాకుమారీ అచలంగా నిర్జీవ ప్రతిమల్లా నిల్చుండిపోయేరు

నిల్చున్న చోటునుండి కదలకుండా, "ఇలారా శశీ !'' అని కఠినంగా పిల్చేడు లక్షింపతి

కలువల్లోంచి నీళ్ళు జారినట్టు శశికళ కళ్ళల్లోంచి కన్నీళ్ళు జలజలా రాలేయి

"ఎందుకా ఏడుపు ?"

చెప్తేమాత్రం ఏమర్థమౌతుం దతనికి?